క్లుప్తంగా

ఆటలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం



గన్నవరంరూరల్: విద్యార్థులకు చిన్ననాటి నుంచి ఆటలు నేర్పాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు షటిల్ పోటీలు నిర్వహించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు చదవటం మాకిష్టం కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులందరికీ వైఎస్సార్ బీమా

ఉంగుటూరు: కుటుంబంలో వ్యక్తి మరణించినా, వికలాంగులుగా మారినా ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టారని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. నాగవరప్పాడు, ఉంగుటూరులో జరుగుతున్న వైఎస్సార్ బీమా నమోదు కార్యక్రమాన్ని ఎంపీడీవో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా కంపెనీలు డబ్బులు కట్టించుకుని బీమా ఇస్తారని అన్నారు. అటువంటిది రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 18–70 ఏళ్ల లోపు వయసున్న వారికందరికీ వైఎస్సార్ బీమా నమోదు చేయాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులతో విజ్ఞానం



ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతులతో విజ్ఞానం పెంపొందుతుందని దళిత ఐక్యవేదిక వ్యవస్థాపకుడు పినమాల నాగకుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు భారతదేశ చరిత్ర, నైసర్గిక స్వరూపాలపై ఉపాధ్యాయుడు వంశీరెడ్డి బోధించారు. శిక్షణ తరగతులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కొలసాని రవికుమార్ మైక్ సెట్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.రమణి పాల్గొన్నారు.

క్రమశిక్షణ, ఏకాగ్రతతో విజయం సాధ్యం

కంకిపాడు: క్రమశిక్షణ, ఏకాగ్రతతో విజయం సాధ్యమేనని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. చదరంగం, క్యారమ్స్ పోటీలు ఏర్పాటుచేసి, కథలు చదివించారు. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

మల్లవల్లి పరిశ్రమల కల్పవల్లి

- మల్లవల్లి పారిశ్రామిక వాడలో ఇథనాల్ పరిశ్రమ
- ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఇథనాల్ తయారీ సంస్థకు 83 ఎకరాల భూకేటాయింపు
- రూ.500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు
- 3300 మందికి ఉపాధి అవకాశాలు



మల్లవల్లిలోని ఇండ్రస్టియల్ పార్కులో పరిశ్రమలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో మరో పరిశ్రమ ఏర్పాటు కానుంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించటం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో మల్లవల్లిలో భారీ పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే భూకేటాయింపులు పూర్తి కాగా, ఈ నెలలోనే నిర్మాణ పనులు సైతం ప్రారంభం కానున్నాయి.

ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు

మల్లవల్లి మోడల్ ఇండ్రస్టియల్ పార్కులో ఇథనాల్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా భూకేటాయింపు చేసింది. దాదాపు 83 ఎకరాలను అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ఏపీఐఐసీ ఇటీవలే రిజిస్ట్రేషన్ పూర్తి చేయటంతో ఈ నెలలోనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇథనాల్ తయారీ యూనిట్ కోసం అవిశా సంస్థ రూ.498.84 కోట్ల పెట్టుబడి పెడుతుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 3300 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇంధన దిగుమతుల వ్యయం తగ్గించుకునేందుకు, కర్బన ఉద్గారాల తగ్గింపు, పర్యావరణ సమతుల్యత కోసం కేంద్ర ప్రభుత్వం రూపొందించిన జాతీయ జీవ ఇంధన విధానం–2018 ప్రకారం 2025 నాటికి పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం ఇథనాల్‌ను బ్లెండింగ్ చేయాలని నిర్దేశించటంతో ఆ తరహా పరిశ్రమలకు ఊతం లభించింది.

రైతులకు ఊతం

చెరకు, మొక్కజొన్నతో పాటు ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి ఇథనాల్ తయారీ చేయటం వల్ల స్థానికంగా ఆయా పంటలకు కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. హనుమాన్ జంక్షన్‌లోని డెల్టా షుగర్స్ గత ప్రభుత్వంలో మూతపడటంతో చెరకు రైతాంగం పలు ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుతో చెరకు, మొక్కజొన్న రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయం రైతాంగంలో వ్యక్తమవుతోంది. అంతేకాక ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయనే భావన వ్యక్తమవుతోంది.



మీర్జాపురం నుంచి ఇండ్రస్టియల్ పార్కుకు నిర్మించిన 150 అడుగుల వెడల్పు రహదారి

150 అడుగుల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రహదారి

బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ మోడల్ ఇండ్రస్టియల్ పార్కు, మెగా ఫుడ్ పార్కుకు వెళ్లే అప్రోచ్ రోడ్డు సిద్ధమైంది. 216 హెచ్ జాతీయ రహదారి నుంచి మల్లవల్లి వరకు సువిశాలమైన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించారు. మీర్జాపురం వద్ద ఎంఎన్‌కే రహదారి (216హెచ్ హైవే) నుంచి మల్లవల్లి వరకు 3.80 కిలో మీటర్ల మేర ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించారు. దీని కోసం మీర్జాపురం, మల్లవల్లి గ్రామాల్లో దాదాపు 39 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించింది. 150 అడుగుల వెడల్పుతో సెంట్రల్ లైటింగ్, రోడ్డు ఇరుపక్కలా పచ్చని మొక్కలు, డ్రైనేజీ సదుపాయాలతో గ్రీన్‌ఫీల్డ్ రహదారిని ప్రభుత్వం నిర్మించింది.



మల్లవల్లి ఏపీఐఐసీ మోడల్ ఇండ్రస్టియల్ పార్కు

> **ఇథనాల్ పరిశ్రమకు భూకేటాయింపులు పూర్తి**
>
> మల్లవల్లిలోని మోడల్ ఇండ్రస్టియల్ పార్కులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు అవిశా ఫుడ్స్ అండ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 83 ఎకరాల భూమిని కేటాయించాం. త్వరలోనే నిర్మాణ పనులు కూడా ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమ స్థాపనలో పారిశ్రామికవాడలో మరో 3300 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. మోడల్ ఇండ్రస్టియల్ పార్కులో ఇప్పటికే 27 పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయి.
>
> – కేఎస్ఎస్ సీతారాం, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొత్తగా రెండు కోర్సులు

గన్నవరం: జాతీయ గుర్తింపు పొందిన స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొత్తగా కంప్యూటర్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్స్‌లకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ అట్లూరి పద్మావతి తెలిపారు. ఆమె శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయని చెప్పారు. వీటితో పాటుగా ఈ విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్స్‌లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఈ రెండు కొత్త కోర్సులకు 60 సీట్ల సామర్థ్యంతో అనుమతులు లభించినట్లు చెప్పారు. కళాశాలలో అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు, సువిశాల క్రీడా మైదానం, నిష్ణాతులైన సీనియర్ అధ్యాపకులు, అధునాతన లైబ్రరీ ఉన్నాయని వివరించారు. ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికలో 35 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. కొత్తగా వచ్చిన కోర్సులను ప్రస్తుతం జరుగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్‌లో ఎంపిక చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైకిల్ వినియోగంతో ఆరోగ్యవంతమైన జీవనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిత్యం సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని జిల్లా యువజన అధికారి సుంకర రాము అన్నారు. బాపులపాడు మండలం శేరీనరసన్నపాలెంలో నెహ్రూ యువకేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము, సర్పంచ్ అడపా అంజిబాబు జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. అధిక సంఖ్యలో యువత, చిన్నారులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని సైకిళ్లు తొక్కారు. శేరీనరసన్నపాలెం నుంచి హనుమాన్‌జంక్షన్ వరకు ఆరు కిలోమీటర్ల మేర సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వివేకానంద యువ కెరటాలు సొసైటీ అధ్యక్షుడు కమ్మిలి సూర్యనారాయణ మూర్తి, మార్షల్ ఆర్ట్స్ కోచ్ కట్టా సుధాకర్, గ్రామ ప్రముఖులు అడపా తులసీదాస్, శ్యాంబాబు పాల్గొన్నారు.



శేరీనరసన్నపాలెంలో సైకిల్ ర్యాలీ

కరుణానిధి సేవలు చిరస్మరణీయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ద్రవిడ ఉద్యమ నేత, రాజకీయ దురంధరుడు ముత్తువేల్ కరుణానిధి సేవలు చిరస్మరణీయమని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు అన్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శత జయంతి సందర్భంగా విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రానికి ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజలకు అందించిన సేవలు నిరుపమానమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగానే కాకుండా తమిళ చిత్రపరిశ్రమలో రచయితగా, నటుడిగా ప్రజల ప్రశంసలు అందుకున్నారని గుర్తు చేశారు. ద్రవిడ మున్నేట్ర కజగం(డీఎంకే) పార్టీకి ఐదు దశాబ్దాల పాటు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న ఘనత కరుణానిధిదే అన్నారు. నివాళులర్పించిన వారిలో కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్, సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.బ్రహ్మేశ్వరరావు, నాయకులు అన్నవరపు బ్రహ్మయ్య, దాలిపర్తి ధన్వంతరి, కాపవరపు నాగ సుధాకర్, పావులూరి రాంప్రసాద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కానూరులో గేదెల చోరీ

పెనమలూరు: కానూరులో గేదెలు చోరీ జరగటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కానూరు పాత చెక్ పోస్టుకు చెందిన కాట్ర ఎస్తేర్‌రాణి మూడు గేదెలు పెంచుతూ పాల వ్యాపారం చేస్తోంది. అయితే రెండు రోజుల క్రితం ఆమె తన గేదెలు ఇంటి వద్ద ఉంచగా గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. పలు ప్రాంతాల్లో వెతికినా వాటి జాడ తెలియలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు కోలవెన్నులో ఉచిత మెగా వైద్య శిబిరం

కంకిపాడు: లైఫ్‌కేర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన కోలవెన్ను గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ పి.మునిరామయ్య తెలిపారు. ఆయన శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) సహకారంతో గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. గుండె, బీపీ, షుగరు, సాధారణ వ్యాధులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని, శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ శీలం రంగారావు తెలిపారు. నిడమానూరులో నిర్మాణం పూర్తయిన మంచినీటి పైప్‌లైన్ పనులను శనివారం రంగారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారం నిమిత్తం రామానగర్‌లో జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ.20 లక్షల నిధులతో మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభించి కొంతవరకు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 4 వాటర్ ట్యాంకులు, మోటారు బోర్లు, మంచినీటి పైప్ లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని వివరించారు. ప్రస్తుతం గ్రామంలో 24/7 తాగునీరు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురైతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న పర్యావరణ కళాజాత

దావాజీగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో శనివారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, గ్లోబల్ ఎన్విరాన్‌మెంటల్ స్టూడెంట్ ఎవేర్నెస్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై కళాజాత ప్రదర్శన నిర్వహించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి కళాకారులు చేసిన ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 5న జరగనున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ సహకారంతో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాకారులు తెలిపారు.

కంకిపాడు ఏఎస్ఓగా భాగ్యశ్రీ

కంకిపాడు: కంకిపాడు ఏఎస్ఓగా సోలే భాగ్యశ్రీ నియమితులయ్యారు. తాజాగా జరిగిన ఉద్యోగుల బదిలీల్లో పామర్రు తహసీల్దార్ కార్యాలయంలో ఏఎస్ఓగా పనిచేస్తున్న భాగ్యశ్రీ కంకిపాడుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం ఆమె కంకిపాడు తహసీల్దార్ టీవీ సతీష్‌ను కలిసి ఉత్తర్వులను అందించి విధుల్లో చేరారు.

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్వచ్ఛత కార్యక్రమాలు

గన్నవరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంసస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలో ఏర్పాటు చేసిన ఏడు స్కిల్‌హబ్‌లు, స్కిల్ కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీపాన శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆకాంక్ష మేరకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జీ20 జన్ భగీధరి(ప్రజల భాగస్వామ్యం)లో భాగంగా జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఈ నెల 15వ తేదీ వరకు స్వచ్ఛత ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. దీనిలో భాగంగా జిల్లాలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయానికి చెందిన చీఫ్ జనరల్ మేనేజర్(ఆర్థిక) బి.రాణి, పలు స్కిల్‌హబ్‌లు, కళాశాలల పర్యవేక్షకులు పాల్గొన్నట్లు చెప్పారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ: నలుగురికి గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: 216 హెచ్ జాతీయ రహదారిపై బాపులపాడు మండలం పెరికీడు వద్ద ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం.. గుడివాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఏలూరు నుంచి గుడివాడ వెళుతుండగా పెరికీడు వద్ద అదుపు తప్పి ఎదురుగా హనుమాన్‌జంక్షన్ వైపు వస్తున్న ఆటోను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లవల్లికి చెందిన ఆటో డ్రైవర్ పంతం జయరాజుతో పాటు బస్సులోని ముగ్గురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన 108 అంబులెన్స్‌లో హనుమాన్ జంక్షన్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ తల, కుడి భుజానికి బలమైన గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ ఏఎస్ఐ సమ్మెట సాయిబాబు, హైవే సేఫ్టీ ఎస్ఐ సుందరరావు ఘటనాస్థలికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు.

ఇరువురు విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం



దుప్పల శ్రీజ



శ్రీ ఉమాప్రియ

గన్నవరంరూరల్: జాతీయ ఉపకార వేతన పరీక్షల్లో గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఇరువురు కృతార్థులైనట్టు హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న దుప్పుల శ్రీజ, శ్రీ ఉమాప్రియ ఒక్కొక్కరికీ ఏడాదికి రూ.12వేల చొప్పున ఇంటర్మీడియెట్ విద్యాభ్యాసం పూర్తయ్యే వరకూ ఏటా ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి సొమ్ము స్వాహా

పెనమలూరు: ఏటీఎం కార్డు మార్చి బ్యాంకు ఖాతాలో సొమ్ము స్వాహా చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు గ్రామానికి చెందిన చిన్నా కిషోర్‌కుమార్ గత నెల 10వ తేదీన ఏటీఎం కార్డుతో పెనమలూరు సెంటర్‌లో ఉన్న ఏటీఎం కౌంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ తన ఏటీఎం కార్డుతో సొమ్ము డ్రా చేయటానికి యత్నించగా సొమ్ము రాలేదు. అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తాను సొమ్ము డ్రా చేసి పెడతానని నమ్మించి కిషోర్ ఏటీఎం కార్డు తీసుకుని ప్రయత్నించగా సొమ్ము రాలేదు. దీంతో కిషోర్ తన ఏటీఎం కార్డు తీసుకుని ఇంటికి వచ్చాడు. ఈ లోగా అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.10 వేలు సొమ్ము విత్‌డ్రా అయ్యాయి. అనుమానంతో తన వద్ద ఉన్న ఏటీఎం కార్డును పరిశీలించగా అది అతని ఏటీఎం కార్డు కాదని తెలిసింది. మోసం చేసిన వ్యక్తి కోసం స్థానికంగా వెతకగా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ ఖాతాలో సొమ్ము చోరీ

పెనమలూరు: మహిళను మోసం చేసి ఆమె బ్యాంకు ఖాతా నుంచి సొమ్ము స్వాహా చేసిన గుర్తు తెలియని వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌కు చెందిన తాడంకి సుజాత విజయవాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోంది. అయితే ఆమె రెండు రోజుల క్రితం పెనమలూరు సెంటర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద ఏటీఎం కార్డుతో డబ్బులు డ్రా చేసే యత్నం చేయగా ఆమెకు డబ్బులు విత్ డ్రా చేయటం రాలేదు. అదే సమయంలో అక్కడ ఉన్న గుర్తు తెలియని వ్యక్తి తాను డబ్బులు డ్రా చేసి పెడతానని చెప్పడంతో అతనికి ఏటీఎం పిన్ నంబర్ చెప్పింది. అతను రూ.2 వేలు డ్రా చేసి సుజాతకు ఇచ్చాడు. ఆ తరువాత సుజాత ఏటీఎం కార్డు తీసుకుని ఇంటికి వచ్చింది. కొద్ది క్షణాలకు ఆమె ఖాతా నుంచి రూ.15 వేలు సొమ్ము డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అనుమతి తీసుకుని వీధుల పేర్లు పెట్టుకోవాలి

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీలో అనుమతులు తీసుకుని వీధుల పేర్లతో బోర్డులు పెట్టాలని కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటనలో వివరాలు తెలుపుతూ తాడిగడప మునిసిపాలిటీ పరిధిలో వీధుల పేర్లు పెట్టాలంటే ముందుగా అనుమతులు తీసుకోవాలన్నారు. అయితే కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా వీధుల వద్ద పేర్లు నామకరణం చేసి బోర్డులు పెట్టారన్నారు. అటువంటి అనధికార బోర్డులు వెంటనే తొలగించాలన్నారు. ఏపీ పురపాలక చట్టం ప్రకారం జూన్ 30వ తేదీ నాటికి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని లేని పక్షంలో జూలై 1వ తేదీ నుంచి అనధికార వీధుల బోర్డులు తొలగిస్తామని కమిషనర్ ప్రకాశరావు తెలిపారు.

చంద్రశేఖర స్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం



గన్నవరంరూరల్: మండలంలోని పురుషోత్తపట్నం శ్రీ పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠా ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గోపూజ వేదస్వస్తి, శాలంగబలి అనంతరం యాగశాల ప్రవేశం జరిగింది. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమై సాయంత్రం నిత్యబలిహారణలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. శివకేశవ ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 7వ తేదీన ప్రతిష్ఠా ఉత్సవం జరగనుంది.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: తన భర్త కనిపించటం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో ఎస్.మహాలక్ష్మి తన భర్త రాఘవతో కలసి ఉంటోంది. ఆమె భర్త పటమటలో ఓ బార్‌లో హౌస్ కీపర్‌గా పని చేస్తున్నాడు. అయితే గత మార్చి 22వ తేదీన భర్త పనికని వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతని కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియ లేదు. అతని ఫోన్ కూడా పని చేయటం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.